28న జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 28న ఉదయం 10.30 గంటల నుండి నిర్వహిస్తామని జెడ్‌పి సిఇఒ ఎ.శ్రీరామచంద్ర మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘల సమావేశాలు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన నియమావళికి లోబడి ఈ నెల 28న ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామని తెలపారు. ఈ సమావేశానికి సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని సిఇఒ ఆ ప్రకటనలో కోరారు.

మూడో జాబితాలో ముగ్గురు

- ఒక పార్లమెంట్, రెండు అసెంబ్లీ స్థానాలకు టిడిపి అభ్యర్థుల ప్రకటన
- రాజమండ్రి ఎంపీ స్థానంపై కొనసాగుతున్న కూటమి కసరత్తు
- పి.గన్నవరం అసెంబ్లీ స్థానంపై వీడని ఉత్కంఠ

హరీష్ మాథూర్
అమలాపురం ఎంపీ అభ్యర్థి

అయితాబత్తుల ఆనందరావు
అమలాపురం ఎంఎల్ఎ అభ్యర్థి

వనమాడి వెంకటేశ్వరరావు
కాకినాడ సిటీ ఎంఎల్ఎ అభ్యర్థి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ కూటమి తమ అభ్యర్థుల ప్రకటనలో ఇంకా జాప్యం చేస్తూనే ఉంది. తాజాగా శుక్రవారం ఎట్టకేలకు మూడో జాబితా విడుదల చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అమలాపురం పార్లమెంట్ స్థానానికి గంటి హరీష్‌మాథూర్, కాకినాడ సిటీ అసెంబ్లీ స్థానానికి వనమాడి కొండబాబు, అమలాపురం అసెంబ్లీ స్థానానికి అయితాబత్తుల ఆనందరావు పేర్లను ఖరారు చేసింది. అయితే రాజమహేంద్రవరం పార్లమెంట్, పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థులపై ఇంకా కూటమి నేతలు కసరత్తులు చేస్తూనే ఉన్నారు. అధికార పక్షం అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాలను ప్రారంభించారు. ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రకటించిన స్థానాల్లో కూటమి అభ్యర్థుల సైతం ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ఉన్న స్థానాల్లో టికెట్లను ఆశిస్తున్న నేతల్లో ఆందోళన నెలకొంది. ఎవరికి సీటు దక్కుతుందనే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. మిగిలిన స్థానాలను కూడా త్వరితగతిని ప్రకటించాలని టిడిపి, జనసేన పార్టీల శ్రేణులు కోరుతున్నాయి.

కూటమి అభ్యర్థిగా లోక్ సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి కుమారుడు గంటి హరీష్‌మాథూర్‌ను మరోసారి అమలాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ సీటుపై టిడిపి అధిష్టానం తీవ్ర కసరత్తులు చేసింది. ఉమ్మడి జిల్లాలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం కీలకంగా మారడంతో దీన్ని టిడిపి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ స్థానానికి మాజీ ఎంపీ ఎజెవిబి.బుచ్చిమహేశ్వరావు కుమార్తె డాక్టర్ సత్యశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ యాతాటి రమేష్‌బాబు పోటీపడ్డారు. వారి బలాలు, బలహీనతలను బేరీజు వేసిన టిడిపి అధినేత చంద్రబాబు చివరకు హరీష్‌మాథూర్‌కే మొగ్గుచూపారు. మరోవైపు అమలాపురం అసెంబ్లీ స్థానంపైనా అధినేత ఆచితూచి నిర్ణయం తీసుకున్నారు. సామాజిక సమీకరణలు, అర్థ, అంగబలం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఆనందరావుకు టికెట్‌ను ఖరారు చేశారు. ఈ స్థానాన్ని మాజీ ఎంఎల్ఎ చిల్లా జగదీశ్వరి, టిడిపి సీనియర్ లీడర్ పడమటి శ్యామ్‌కుమార్ తదితరులు ఆశిస్తూ వచ్చారు. జగదీశ్వరి పలు సందర్భాల్లో అమలాపురం నుంచి పోటీకి సిద్ధమంటూ ప్రకటించారు. అయినప్పటికీ చంద్రబాబు ఆనందరావుకే టిక్కెట్‌ను కేటాయించారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఉత్కంఠకు తెరపడింది. మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబుకే ఈ సీటు దక్కింది. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి ఈ టిక్కెట్టు కోసం గట్టి ప్రయత్నాలే చేసినా ఫలించలేదు. మరోవైపు బిజెపి కూడా ముమ్మర ప్రయత్నాలు చేసింది. పోతుల విశ్వం, గట్టి సత్యనారాయణ వంటి నాయకులు పలుమార్లు ముఖ్య నేతల వద్దకు వెళ్లి తమ నిర్ణయాలను చెప్పుకున్నారు. తాజాగా టిడిపి నుంచి కొండబాబుకు టికెట్ కేటాయించడంతో బిజెపి ఆశావహుల్లో అసంతృప్తి నెలకొంది. ఎన్నికల్లో కొండబాబుకి సహకరించేది లేదంటూ ఆ పార్టీ శ్రేణులు నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు టికెట్ ఆశించి భంగపడ్డ చంద్రమౌళి కూడా తీవ్ర నిరాశతో అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. పార్టీకి ఆర్థికంగా అనేక సహాయ, సహకారాలు అందజేసినా తనకు సరైన గుర్తింపు లేదని మదన పడుతున్నారు. రెబల్‌గా సిటీ నియోజకవర్గ నుంచి పోటీలో ఉండాలని అనుచరులు కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

మిగిలిన స్థానాల్లో ఉత్కంఠ

మిగిలిన స్థానాల్లో అభ్యర్థులను ఇంకా ప్రకటించకపోవడంతో కూటమి ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ కొనాసాగుతోంది. రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానం దాదాపుగా బిజెపికి ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశం ఉంది. అయితే అధికారికంగా దీనిపై ఇంకా ప్రకటన వెలువడలేదు. త్వరలోనే ఈ మేరకు ప్రకటన వచ్చే అవకాశం ఉంది. అలాగే పి.గన్నవరం అసెంబ్లీ స్థానం అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. మహాసేన రాజేష్‌కు టికెట్ కేటాయించినప్పటికీ కొన్ని రాజకీయ పరిణామాలు చోటు చేసుకోవడంతో ఆయన పోటీ నుంచి వెనక్కి తగ్గినట్లు ప్రకటించారు. ఇదే స్థానాన్ని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఉన్నతాధికారి గిడ్డి సత్యనారాయణ ఆశిస్తున్నారు. అందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మరోవైపు బిజెపి కూడా ఈ స్థానంపై పట్టుబడుతుతోంది. అమలాపురం ఎంపీ చింతా అనురాధ భర్త బిఎస్ఎన్.మూర్తి గతంలోనే బిజెపిలో చేరారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మరో మాజీ ఐఆర్ఎస్ అధికారి కూడా ఉన్నారు. బిజెపి నుంచి ఆయన్ని బరిలో దింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా టిడిపి మూడో జాబితా ప్రకటనతో జిల్లాలో ఎన్నికల సందడి మరింత ఊపు అందుకుంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పోటాపోటీగా ప్రచార పర్వంలో ఉన్నారు. ఏ ఇద్దరు కలిసినా అభ్యర్థుల గెలుపు, ఓటమిలపైనే చర్చ జరుగుతోంది. ఎక్కడ చూసినా ఎన్నికల సమావేశాలు, సమాలోచనలు, ఎక్కడ విన్నా అభ్యర్థుల బలాబలాలు వంటి అంశాలనే మాట్లాడుకుంటున్నారు.

ఓటరు జాబితా దరఖాస్తుల పరిష్కారం

ప్రజాశక్తి-కాకినాడ

ఓటరు జాబితాపై దాఖలైన దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికాశుక్లా హాజరయ్యారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సన్నద్ధత, ఫారం 6, 7, 8ల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇవిఎంల రిపోర్టు, సి-విజిల్ రిపోర్టు, రాజకీయ పార్టీల ప్రచారం అనుమతులు మంజూరు, పోస్టల్ బ్యాలెట్ వంటి అంశాలపై సిఇఒ ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల ప్రవర్తన నియమావళికి తీసుకున్న చర్యలపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సిఇఒకు వివరించారు. జిల్లాలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా ముద్రించిన దగ్గర నుంచి ఓటరు జాబితాపై దాఖలైన దరఖాస్తులను గడువులోపు పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్, ఎన్నికల డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్నికల అధికారి, కలెక్టర్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన రాష్ట్రస్థాయిలో సమీక్షించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, సిడిఎంఎతోపాటు పలువురు ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ ఇక్కడి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.28 కోట్ల వ్యయంతో నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణను రూపొందించామన్నారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, అద్దె ప్రాతిపదికన జనరేటర్ల ఏర్పాటు, మోటార్లు మరమ్మతులు సహా సుమారు 20 పనులకు సంబంధించి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. కాకినాడ ప్రజలకు నీటిని సరఫరా చేసే వేసవి జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు ఎంత ఉన్నాయి? సమృద్ధిగా ఉన్నాయా? లేదా? వంటి అంశాలను కమిషనర్ ఆరా తీశారు. అలాగే ప్రజల అవసరాల మేరకు ఆయా ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రజలు మంచినీటి ఎద్దడి ఎదుర్కోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో స్మార్ట్‌సిటీ ఎస్ఇ పి.వెంకటరావు, ఇఇ మాధవి, డిఇ సుబ్బారావు, ఎఇలు ఎం.రమేష్‌బాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - సామర్లకోట, కాజులూరు

5, 16 వార్డు కొలవారి వీధికి చెందిన సుమారు 50 మంది ఎంఎలఎ నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం బలపరిచిన ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని, నియోజకవర్గ అభివద్ధికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, నిమ్మకాయల రంగనాగ్, యార్లగడ్డ రవి చంద్ర ప్రసాద్, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, వల్లూరి దొరబాబు, శెట్టిబత్తుల దుర్గ, తాతపూడి పవన్ కుమార్, పాల్గొన్నారు. కాజులూరు మండలంలోని గొల్లపాలెంలో వైసిపి మండల అధ్యక్షుడు అధ్యక్షుడు గుబ్బల యేసు రాజు ఆధ్వర్యంలో సెలపాక సర్పంచ్ పోతుగనిరాజు, దుగ్గుదుర్రు సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి జ్యోతి కుమార్, రామచంద్రపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ దంగేటి పద్మావతి అరుణ్ కుమార్, రాయుడు భాస్కరరావుతో పాటు 500 మంది కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరందరికీ టిడిపి రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

మూతబడిన పరిశ్రమలు తెరిపించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులకు ఉపాధి దూరమైందని, తక్షణం మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలని సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బిక్కవోలు మండలంలో గాయత్రి బయో ఆర్గానిక్స్ స్టార్చ్ పరిశ్రమను గుజరాత్‌కు చెందిన బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రవేట్ లిమిటెడ్ 2018లో కొనుగోలు చేసిందన్నారు. ఐదేళ్లు పూర్తికాకుండానే నేడు కృత్రిమ నష్టాలు చూపించి మూసివేతకు సిద్ధపడిందని చెప్పారు. ముడి సరుకు లభించక లేఆఫ్ ప్రకటించాల్సి వచ్చిందని కార్మికులకు యాజమాన్యం చెప్పడాన్ని తప్పుబట్టారు. కేవలం పర్మినెంట్ కార్మికులను వదిలించుకుని, వేతన ఒప్పందాన్ని ఎగవేయడం కోసమే ఈ కృత్రిమ నష్టాలను చూపిస్తున్నారని తెలిపారు. మోడీ తెచ్చిన చట్టాల ప్రకారం ఏ హక్కులూ లేని తక్కువ వేతనాలతో పని చేసే కార్మికులతో నడపాలనే దుర్బుద్ధి యాజమాన్యానికి కలగడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. ఈ పరిశ్రమపై ఆధారపడి 300 కుటుంబాలు, పరోక్షంగా 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. 2022లో సామర్లకోట సుగర్ పరిశ్రమ మూతబడి ప్రత్యక్షంగా రెండు వేల కుటుంబాలు, పరోక్షంగా వేలాది రైతుల కుటుంబాలు నష్టపోయాయన్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించుకుని పరిశ్రమలు నడిచేందుకు ప్రయత్నించాలని, కానీ జిల్లాలో అలాంటి ప్రయత్నాలు సిఎం జగన్ చేయకపోవడం దురదృష్టం అన్నారు.

కార్మికశాఖ కార్యాలయం వద్ద కార్మికులు

కేజ్రీవాల్ అరెస్టుకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి-కాకినాడ

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఈడి అధికారులు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు నిర్వహించి అరెస్ట్ చేయడం పట్ల సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ ప్రజలను భయకంపితులను చేసి ఎన్నికలలో లాభపడాలని, ఇండియా బ్లాక్ పార్టీలను దెబ్బ తీయాలని బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. బిజెపి కక్షపూరిత ప్రతీకార చర్యలను, నిరంకుశ పద్ధతులను ప్రతి ఒక్కరు ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేసారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతిపక్షాలు ప్రత్యేకించి ఇండియా బ్లాక్ పార్టీలపై రాజకీయ కక్షపూరిత చర్యలను ఆపాలని రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రాజెక్టు మేనేజర్ లావణ్య

విపత్తు నిర్వహణ మేనేజర్‌గా లావణ్య

ప్రజాశక్తి-కాకినాడ

విపత్తు నిర్వహణ శాఖ జిల్లా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మందుల లావణ్య నియమితులయ్యారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి డి.తిప్పే నాయక్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్‌డిఒగా పని చేస్తూ బదిలీపై వచ్చారు.

ఇవిఎం, వివిప్యాట్స్‌కు పటిష్ట భద్రత

ప్రజాశక్తి-కాకినాడ

లోక్ సభ, శాసనసభ-2024 ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఇవిఎం, వివి.ప్యాట్ గోదాముకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివి.ప్యాట్ గోదామును శుక్రవారం కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులను వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెలా ఇవిఎం, వివి.ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం, వివిప్యాట్స్ క్షుణ్నంగా పరిశీలిస్తామన్నారు. సాధారణ ఎన్నికలు 2024 సంబంధించి షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికలు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఇవిఎం, వివి.ప్యాట్ గోదాము భద్రతపై అప్రమత్తతో వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్, కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, అగ్నిమాపక శాఖ అధికారి ఏసుబాబు, తహశీల్దార్ కె.చెల్లన్నదొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (టిడిపి), ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), కె.విజయ రామయ్య(బిజెపి), ఎస్.అప్పారావు (బిఎస్‌పి), వాసంసెట్టి చంద్రరావు (సిపిఎం) కలెక్టరేట్ డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

వనమాడికి పలువురి అభినందన

ప్రజాశక్తి-కాకినాడ

టిడిపి కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)ను ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం పలువురు పార్టీ నాయకులు ఆయనను అభినందించారు. కాకినాడ జగన్నాథపురం చర్చి స్క్వేర్ సెంటర్లో ఉన్న కొండబాబు ఇంటి వద్ద కార్యకర్తలు సంబరాలు చేశారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. కొండబాబుకు పుష్ప గుచ్ఛాలిచ్చి సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆదిత్య కళాశాలలో నెక్సస్-2024 ఫెస్ట్

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నెక్సస్-2024 సైన్స్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించినట్లు డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక రంగంలో నూతన అంశాలను తెలియజేసేందుకు ఈ ఫెస్ట్ నిర్వహించినట్టు చెప్పారు. నూతన పరిజ్ఞానాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని, నేడు ఎఐ టెక్నాలజీ, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ టెక్నాలజీలపై విద్యార్థులు దృష్టి సారించాలని తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఈ విధమైన సదస్సులు విద్యార్థుల సాంకేతి పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి, భావ వినిమయానికి దోహదపడతాయని తెలిపారు.

ఫెస్ట్‌లో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు

అత్యవసర సేవల్లో వారికి పోస్టల్ బ్యాలెట్

ప్రజాశక్తి-కాకినాడ

వివిధ అత్యవసర సేవల్లో పనిచేస్తూ పోలింగ్ రోజున తాము నమోదైన పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయలేని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.కతికా శుక్లా తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమీషన్ సూచించిన రాష్ట్రంలోని 33 అత్యవసర సేవా విభాగాల ఉద్యోగులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని ఆమె తెలిపారు.

ఇద్దరు వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

ప్రజాశక్తి - కిర్లంపూడి

కృష్ణవరం గ్రామంలో వాలంటీర్లు దాడి గణేష్, చేదూలూరి గంగాధర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ బడే రాజేశ్వరరావు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కోలా వీరబాబును తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ అడపా వెంకట లక్ష్మి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా వైసిపి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. తాత్కాలికంగా సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబుకు వివరణ ఇవ్వమని వారం రోజులు సమయం ఇచ్చారని తెలుస్తోంది.

కార్టూన్ 'నిజం'



సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు : మంత్రి

అవార్డు అందుకుంటున్న ప్రతినిధులు

ఒడిగోస్‌కు గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక రమణయ్యపేటలో ఎపిఎస్‌పి వద్ద ఉన్న విజెఎస్ఎంఆర్.ఒడిగోస్ బెస్ట్ సాఫ్ట్‌వేర్ అండ్ ట్రైనింగ్ రిక్రూట్‌మెంట్ కంపెనీగా గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డు దక్కించుకుంది. దీంతో కంపెనీ కార్యాలయంలో శుక్రవారం అభినందన సమావేశం నిర్వహించరాఉ. ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ మాట్లాడుతూ బుధవారం ఢిల్లీలోని హోటల్ రాడిసన్ బ్లూలో జాతీయ టూరిజం శాఖ మంత్రి శ్రీపాద ఏసో నాయక్, బాలీవుడ్ హీరోయిన్ ఊర్మిళ ఈ అవార్డును అందజేశారని తెలిపారు. సివైఫ్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడుతూ సంస్థను ప్రశంసించారు. వార సత్యనారాయణ, డాక్టర్ వంశికృష్ణ రాజా, గగారిన్, వాసిరెడ్డి ఏసుదాస్, డాక్టర్ పివివి.సత్యనారాయణ, ధర్మారావు, రేఖ రెడ్డి అబ్రహం, బాలాజీ, జాషువాగిరి, మచ్చ బుజ్జి, జి.విల్సన్, మేరీ జ్యోతి, ఒడిగోస్ మేనేజర్ శిరీష, ప్రియా, లారా, విజయ్ పాల్గొన్నారు.

నీరు లేనిదే జీవకోటి మనుగడ లేదు

ప్రజాశక్తి-పిఠాపురం

నీరు లేనిదే జీవకోటికి మనుగడ లేదని, నీటిని పొదుపుగా వినియోగించుకుందామని హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ అధ్యక్షుడు ఎన్.జోజిబాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ నీటి యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా జోజిబాబు మాట్లాడుతూ నీరు సంపూర్ణంగా లభిస్తుందని విచ్చలవిడిగా వాడుతూ దుర్వినియోగం చేస్తే భవిష్యత్తు తరాలు నీటిని కన్నీళ్లలోనే చూడాల్సి వస్తుందన్నారు. గతంలో మన పూర్వీకులు చెరువుల్లో నీళ్లు తాగే వారిని తరువాత తరం బావులు, ప్రస్తుత తరం బాటిల్ ద్వారా చూస్తున్నామన్నారు. నీటిని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తూ పోతే భవిష్యత్తు తరాలు బాటిల్ మూతల్లో నీటిని చూసే పరిస్థితి వస్తుందన్నారు. మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకుంటూ... వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతల ద్వారా ఆ నీటిని మళ్లించి భూగర్భ జలాలను పెంచాలని కోరారు. చెట్లను విరివిగా పెంచడం ద్వారా మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, పవన్ కుమార్, ఎస్‌కె.రఫీ, ఆర్.వీర గణేష్, ఎస్‌కె.కరీముల్లా, నాయకులు రామకృష్ణ, రాజు, కన్నా, కరుణ రాజు, చిన్న, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

చేయి తడిపితేనే.. చేను తడిసేది..

సాగునీరు లేక చేలు బీటలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

నీటిపారుదల శాఖ సిబ్బంది చేయి తడిపితేనే మా చేలు తడుస్తున్నాయని లేనియెడల పంట పొలాలు ఎండిపోవాల్సిందేనని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 20 రోజులుగా వరి పొలానికి నీరు లేక బీటలు వారుతున్నాయని పలువురు రైతులు వాపోయారు. తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని చిన్న తూరిపేట ప్రాంతంలోని సుమారు 150 ఎకరాలు ఆరు తడి లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు దృష్టికి రైతులు తీసుకువచ్చారు. డబ్బులు ఇచ్చిన వారికే ఇరిగేషన్ సిబ్బంది సాగునీరు వదులుతున్నారని, ఇళ్ల నాగేశ్వరరావు, గుత్తుల మహేష్, కడియాల శ్రీను, తిరుకోటి అప్పారావు, పెద్దిరెడ్డి రాము, గుత్తుల కృష్ణ, దొమ్మేటి సూర్య భగవాన్, సబ్బతి మావుల్లు తదితర రైతులు తెలిపారు. రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థలు వేలాది క్యూసెక్కుల సాగునీరు తరలిస్తున్నారని, రైతాంగానికి చుక్క నీరు ఇవ్వడం లేదని వాపోయారు. రైతులు ఆందోళన చేస్తే ఇటీవల గ్రాంట్ గ్రామం, తమ ప్రాంతంలోని రైతులకు ఒఎన్‌జిసి పైపులైను ద్వారా కొంత మేరకు నీరు అందించారని ఆ నీరు తమ పంట పొలాలకు చేరేలోపే సాగునీటి సరఫరా నిలుపుదల చేశారని తెలిపారు. పొలాలు పూర్తిగా నీరు లేక పంట నాశనం అవుతున్నాయన్నారు. ఈనిక దశలో సాగునీరు లేకపోవడం వల్ల వరి పొలం పొల్లు కాయలుగా మారిపోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. చివరి దశలో ఉన్న పంట పొలాలకు వెంటనే పూర్తిస్థాయిలో సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు పంటచేలో నడుస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఈనిక దశలో ఉన్న వరి దుబ్బులను చూపుతున్న రైతులు

రిలయన్స్, ఒఎన్‌జిసి పైపులైన్లు వేసుకోవాలి

రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థలు తాళ్లరేవు డిపెడింగ్ డామ్ వద్ద, మల్లం కోట లాకుల వద్ద నుంచి వేలాది క్యూసెక్కుల నీరు ప్రతినిత్యం తరలించుకుపోతున్నారు. దీనివల్ల రైతాంగానికి నీటి ఎద్దడి తలెత్తుతోంది. అదనంగా ఎటువంటి సాగునీటి కేటాయింపులు లేకుండానే, రైతాంగానికి వచ్చిన సాగునీటినే ఈ సంస్థలు తరలించుకుపోతుంటే నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సాగునీరు ఎద్దడి సమయంలో రిలయన్స్, ఒఎన్‌జిసి పైపులను నిలుపుదల చేసి రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థలు ధవళేశ్వరం నుంచి నేరుగా పైపులైను నిర్మించుకుంటే అసలు ఈ నీటి ఎద్దడి పరిస్థితి రాదు.

- వల్లు రాజబాబు,
ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి.

నేరాలు ఘోరాలు

దుకాణాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం దుళ్ల గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కెవిఎస్ఎవి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, అగ్రికల్చర్ ఇన్‌పుట్ అవుట్‌లెట్ ఎరువుల షాప్‌లో తనిఖీలు చేశామన్నారు. స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించలేదని, బిల్లులపై రైతుల సంతకాలు లేవని, స్టాక్ బోర్డు అప్డేట్ చేయలేదని తెలిపారు. ఈ మేరకు షాపు యజమానిపై 6ఎ కేసు నమోదు చేశామన్నారు. రూ.1,08,331 విలువ చేసే 3.5 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశామన్నారు. పురుగు మందుల అమ్మకాలను 21 రోజులపాటు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాల నాయుడు, భార్గవ మహేష్, కడియం మండల వ్యవసాయ అధికారి ద్వారకా దేవి పాల్గొన్నారు.

గండేపల్లిలో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - రాజానగరం, గండేపల్లి

గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహిళలు రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల మేరకు చింతపల్లి అటవీ ప్రాంతం నుంచి చెన్నయ్‌కు చెందిన ఇద్దరు మహిళలు జర్నీ ట్రాలీ బ్యాగ్‌లో గంజాయిని పెట్టుకుని బస్సులో ప్రయాణిస్తున్నారు. తూర్పు గోనుగుడెం జాతీయ రహదారి చెక్ పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇది గమనించి మహిళలు చెక్ పోస్టు సమీపంలో బస్సు దిగిపోయారు. గంజాయి ఉన్న ట్రాలీ బ్యాగ్‌లను తీసుకుని కంగారుగా వెళ్తున్నారు. గమనించిన పోలీసులు వారిని ఆపి తనిఖీ చేశారు. బ్యాగుల్లో 20 కేజీల గంజాయిని గుర్తించారు. దీని విలువ రూ.2.10లక్షలు ఉంటుందని తెలిపారు. వెంటనే వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

గండేపల్లి మండలంలో గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జగ్గంపేట సిఐ లక్ష్మణరావు తెలిపారు. మల్లేపాక గ్రామానికి చెందిన కాపవరపు బాలాజీ, జగ్గంపేట గ్రామానికి చెందిన నైనపు సురేష్ బైకుపై 23 కేజీల గంజాయిని తీసుకుని వెళుతుండగా మురారి గ్రామంలో చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ నౌడు రామకష్ణ, పోలీస్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు.

పోక్సో కేసు కొట్టివేత

ప్రజాశక్తి-కాకినాడ

బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎంవిఆర్. ఉపేంద్రపై నమోదు చేసిన పోక్సో కేసును కాకినాడ పోక్సో కోర్టు జిల్లా జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు కొట్టి వేస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. 2019లో పిఠాపురం టౌన్ ఎస్ఐ అబ్దుల్ నబీ ఉపేంద్రపై లైంగిక వేదింపుల ఆరోపణలపై కేసు నమోదు చేసారు. అసోసియేషన్‌ల ఒక క్రీడాకారిణిపై ఉపేంద్ర లైంగిక వేధింపులకు పాల్పడినట్టు పోలీసులకు ఫిర్యాదు చెయ్యడంతో కేసు నమోదు చేసారు. ఆరోపణలు రుజువు కానందున కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పునిచ్చారు,

పోక్సో కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూల్లో చదువుతున్న ఐదేళ్ల బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక చర్యకు పాల్పడడంతో పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు గండేపల్లి ఎస్సై రామకష్ణ తెలిపారు. దిశ డిఎస్‌పి రామచంద్రరావు ఆధ్వర్యంలో సిఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

సారాను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

85 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎస్ఇబి అధికారులు ఏలేశ్వరం ప్రత్తిపాడు మండలాల్లో దాడులు నిర్వహించి 85 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, పెద్ద ఎత్తున బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఇబి సిఐ ఎల్.చిరంజీవి తెలిపిన వివరాలివి. ఏలేశ్వరంలో 35 లీటర్ల సారాతో పాటు అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 8 లిక్కర్ సీసాలను స్వాధీనం చేసుకుని తల్లీ కొడుకులపై కేసు నమోదు చేశామన్నారు. ప్రత్తిపాడు మండలం వేములంపాలెంలో 1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నమన్నారు. మరో ప్రాంతంలో పెద్ద ఎత్తున బెల్లపు ఊట ధ్వంసం చేసి 30 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎం.ఆశాలత, వెంకన్న దొర, కృష్ణార్జున రావు, దొరబాబు, రాజు, వీరభద్రరావు ఉన్నారు.

80 పట్టు చీరల స్వాధీనం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

పిఠాపురం నుంచి ఉప్పాడ రోడ్డు మార్గంలో వస్తున్న కారులో 80 పట్టు చీరలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల తనిఖీ అధికారి బుర్రా వేణుగోపాల్ తెలిపారు బిల్లులు లేకపోవడంతో చీరలు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు ధర్మవరం గ్రామంలో ముడి సరుకులు ఇచ్చి చీరలు తయారు చేయించి విక్రయించేందుకు ఉప్పాడ చీరల షాప్‌లకు వెళ్తూ ఉంటామని బాధితుడు కాకి చక్రధర్రావు తెలిపారు చేనేత మగ్గంపై తయారుచేసిన వాటికి ఇటువంటి బిల్లులు ఉండవని బాధితుడు తెలిపాడు.

ముషిణికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

వెనుకబడిన తరగతుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది ముసిణి రామకృష్ణారావుకు ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని పలువురు బిసి నాయకులు కోరారు. కట్టా శ్రీనివాసరావు, ఎం.శివప్రసాద్, వాసంశెట్టి జగదీశ్, రెడ్డి త్రిమూర్తులు, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకట్ తదితరులు తాళ్ళరేవులో విలేకరులతో మాట్లాడారు. వారి వెంట కడలి సత్యనారాయణ, వై.ధనరాజు, మేడిశెట్టి సురేష్, గుత్తుల నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణరావు, అప్పారి వెంకటరావు, ఎం.సురేష్, కె.వరప్రసాద్, బి.హరి ఉన్నారు.

వైసిపిలో చేరిన న్యాయవాది ప్రసాద్

వైసిపిలోకి ప్రముఖ న్యాయవాది ప్రసాద్

ప్రజాశక్తి-సామర్లకోట

సామర్లకోటకు చెందిన న్యాయవాది మలిరెడ్డి ప్రసాద్ శుక్రవారం వైసిపిలో చేరారు. పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు ప్రసాద్‌కు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మన్యం చందర్రావు, కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్, నాయకులు పుట్టా సూరిబాబు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రాల దానం

ప్రజాశక్తి- తాళ్లరేవు

పి.మల్లవరం గ్రామానికి చెందిన ఆనాల ఛాయారత్నం (70) శుక్రవారం మరణించడగా ఆమె నేత్రాలను బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. ఆమె సోదరుడు ధూళిపూడి సత్యన్నారాయణ మూర్తితో సామాజిక కార్యకర్త లయన్ ధూళిపూడి వెంకటరమణ (బాబి) సంప్రదించి ఛాయారత్నం కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది రవి, నాని నేత్రాలను సేకరించారు.

పరీక్షకు 118 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -సామర్లకోట

నాలుగవ రోజు పదో తరగతి లెక్కల పరీక్షకు మండల పరిధిలో 118 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఇఒ వై.శివరామకష్ణయ్య చెప్పారు. సామర్లకోటలో నిర్దేశించిన అన్ని సెంటర్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసింది. మండలంలో నిర్దేశించిన తొమ్మిది సెంటర్లోనూ వెరసి మొత్తం 1915 మంది విద్యార్థులకు గాను 1797 మంది పరీక్షకు హాజరయ్యారని, 118 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు వివరించారు.

ఎమ్‌డియు వాహనదారులతో సమీక్ష

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ఎండియు వాహనాదారులతో శుక్రవారం తహశీల్దారు విద్యాపతి సమావేశం అయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలపై ప్రజా ప్రతినిధుల ఫోటోలు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఏ వాహనంపైనా ఫోటోలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డీలర్లతో సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సత్యనారాయణ సిబ్బంది ఉన్నారు.

విఆర్‌ఒ రక్తదానం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు విఆర్‌ఒ దుర్గాప్రసాద్ రక్తదానం చేశారు. పసలపూడికి చెందిన ఒక యువకునికి అరుదైన బ్లడ్ గ్రూప్ ఎబి నెగిటివ్ కావాలని తెలియడంతో ఆయన స్వచ్ఛందంగా వెళ్లి దానం ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఎదుటి వ్యక్తి ప్రాణాలు కాపాడడంతో పాటు మనము మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చున్నారు.

గ్రామాల్లో వరుపుల పర్యటన

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని బంగారయ్యపేట. కోడూరు గ్రామపంచాయతీల్లో వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సుబ్బారావు శుక్రవారం పర్యటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్ఎగా తనకు ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. వైసిపి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గొల్లి లక్ష్మణ్ మూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు తాతాజీ, సరణం శ్రీను పాల్గొన్నారు.

తిరుపతి గ్రామంలో దొరబాబు ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు శుక్రవారం తిరుపతి గ్రామంలో కర్రి వెంకట జగదీశ్వరరావు, కుంచె బుచ్చిరాజు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిరియాల రాజా, రాష్ట్ర నాయకుడు కంటే వీరరాఘవరావు, నెక్కంటి సాయి ప్రసాద్, దవులూరి సుబ్బారావు, గోపు నారాయణమూర్తి, సయ్యద్ జానీ, గోపు మురళి, పెంటా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

115 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం : తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చివటంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో శుక్రవారం కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. పరమ హంస యోగానంద నేత్ర వైద్యశాల సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 115 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపల్ ఆర్‌కె.ఫణిధర్, అధ్యాపకులు భూపాల్, డాక్టర్ ఐవి.నారాయణ, ప్రోగ్రాం మేనేజర్ ఎన్.చంటిబాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విగ్రహం విషయంలో వివాదాలు వద్దు

ఉండ్రాజవరం : విగ్రహం విషయంలో వివాదాలు వద్దని పోలీసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని మోర్త, వెలగదుర్రు, తాడిపర్రు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. కొంతకాలంగా గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం విషయంలో వివాదం నడుస్తోంది. ఇది ఆర్‌డిఒ కోర్టులో ఉంది. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహానికి వేసిన ముసుగులను తొలగించి అలజడి సష్టించారు.

యానాం వార్తలు

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం ఉదయం యానాం సబ్ జైలు రోడ్డు, పరిసరప్రాంతంలో తుప్పలను, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యానం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థులుగా నమశ్శివాయం, వైద్యలింగం

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఏప్రిల్ 19న జరిగే లోక్ సభ ఎన్నికలకు సంబంధించి పుదుచ్చేరి ఎన్.ఆర్.కాంగ్రెస్ పార్టీ, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా ఎ.నమశ్శివాయంను ప్రకటించారు. ఇండియా కూటమి అభ్యర్థిగా ప్రస్తుత కాంగ్రెస్ ఎం.పి.వైద్యలింగంను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అన్నా డిఎంకె.అభ్యర్థిగా తమిళ వేందన్‌ను ఆ పార్టీ ప్రకటించింది.

ఎంఎల్ఏ చినరాజప్ప ప్రచారం

ప్రజాశక్తి -సామర్లకోట

ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామితో కలిసి ఆయన ప్రచారం చేశారు. తొలుత బ్రౌన్‌పేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 3,4 వార్డుల్లో వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. టిడిపి నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, అందుగుల జార్జి చక్రవర్తి, నూతలపాటి అప్పారావు, గొల్లపల్లి కామరాజు, సలాది వెంకటేశ్వర రావు, వల్లూరి దొర, చుండ్రు బలరామ్, జనసేన నాయకులు సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, లక్ష్మణ్ దివాకర్, కటారి శ్రీను పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి నానాజీ ప్రచారం

ప్రజాశక్తి -కరప

జనసేన పార్టీ అభ్యర్థి పంతం నానాజీ శుక్రవారం టిడిపి, బిజెపి నాయకులతో కలిసి గొడ్డటిపాలెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు, కటకంశెట్టి ప్రభాకర్, గుల్లిపల్లి శ్రీనివాసరావు, దేవు వెంకటేశ్వరరావు, బండారు మురళి, కరెడ్ల గోవింద్, చుండ్రు వెంకన్న రాయ చౌదరి, కోటగిరి మహేంద్ర బాబు, రెడ్డి వీరవెంకట సత్యనారాయణ, మద్దూరి స్వామి, వీరంరెడ్డి ముత్యాలరావు పాల్గొన్నారు.

జనన, మరణ పత్రాల జారీపై మార్గదర్శకాలు

ప్రజాశక్తి-కాకినాడ

జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి త్వరలోనే కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని కేంద్రానికి చెందిన డిసిఒ అధికారుల బందం వెల్లడించింది. హైదరాబాదులోని డైరెక్టర్ సెన్సస్ ఆపరేషన్ (డిసిఒ) డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ పిఎల్ఎన్‌సి శశి కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రజ్ శుక్రవారం కాకినాడ నగరపాలక సంస్థలోని జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన విభాగాన్ని సందర్శించారు. ఎంహెచ్‌ఒ డాక్టర్ పథ్వీచరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు చెందిన అధికారులు వీరితో సమావేశం అయ్యారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి ప్రస్తుత అనుసరిస్తున్న మార్గదర్శకాలు ఏమిటి, వీటిని ప్రస్తుతం ఎలా జారీ చేస్తున్నారు, అన్ని నిబంధనలను అనుసరిస్తున్నారా, ఆన్‌లైన్ విధానాన్ని ఎలా ఫాలో అవుతున్నారు, రికార్డుల భద్రత ఎలా ఉంది తదితర అంశాలను ఆరా తీశారు. రికార్డులను కూడా పరిశీలించి పూర్తి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతి మరణ ధ్రువీకరణలోనూ మరణానికి గల కారణాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. జనన మరణాల సమాచారాన్ని అందించే సంబంధిత ఆసుపత్రి వర్గాలు, ఉద్యోగులకు తప్పనిసరిగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి త్వరలోనే మరిన్ని కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని వీటన్నింటినీ అధ్యయనం చేసి ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు.

కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్న అధికారులు

వైసిపి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షునిగా నాని

ప్రజాశక్తి - తాళ్లపూడి

వైసిపి యువజన విభాగం తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షునిగా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన పప్పొప్పుల నానిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తూ మరోసారి వైసిపి అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తానన్నారు. నాని నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మలకపల్లిలో తలారి ప్రజా ఆశీర్వాద యాత్ర

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని మలకపల్లిలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు శుక్రవారం ప్రజాఆశీర్వాద యాత్రను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచారు. వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ప్రజలను మోసగించేందుకు మూడు పార్టీలు కలిపి ఉమ్మడిగా వస్తున్నాయని వీరికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామానికి వచ్చిన తలారికి సొసైటీ అధ్యక్షులు కుంటముక్కల కేశవ నారాయణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వం రావు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహశీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఓటర్లకు సూచించారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు వేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా అధికారులకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లకు ఓటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

4న అరసం జిల్లా వార్షికోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) తూర్పుగోదావరి జిల్లా ప్రథమ వార్షికోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు 18వ వర్ధంతి సందర్భంగా స్మారక పురస్కారాల కార్యక్రమం ఏప్రిల్ 4న ఆర్‌టిసి బస్సు కాంప్లెక్స్ సమీపంలో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరుగుతుందని అరసం జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగే సభకు సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కర్రి రామారెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌పి.గంగిరెడ్డి, విశిష్ట అతిథిగా బొల్లినేని నాగార్జునసాగర్ పాల్గొంటారని తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రకటనలో కోరారు. పడాల రామారావు స్మారక పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకునే వారు పడాల వీరభద్రరావు సెల్ నెంబర్‌ను 9493281776ను సంప్రదించాలన్నారు.

6వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మెయిన్ బజార్‌లో గల మదన గోపాల స్వామి ఆలయం వద్ద వార్షిక కళ్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం 6వేల మందికి అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సింహాద్రి జనార్ధన్ రావు మాట్లాడుతూ పదేళ్లుగా ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిర్వాహకులు సొలస ఉమ, గోకవరపు మాణిక్యం, అప్పన శ్రీకాంత్, కె.వినయ్, ఎ.వంశీ, సాయి, మణికంఠ తదితరులు పర్యవేక్షించారు.

ఓం నమో వేంకటేశాయ నమః
దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ బాలబాలాజీ దేవస్థానం, అప్పనపల్లి
మామిడికుదురు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సీల్డు టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన
ఆర్.సి. నెం. బి5/268-3/2024, తేది: 22-03-2024

ది. 27-03-2024వ తేదీ మ॥ గం॥ 02.00లకు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, అప్పనపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ బాలబాలాజీ దేవస్థానం నందు ఈ దిగువ ఉదహరించిన వాటికి సీల్డు టెండరు-కమ్-బహిరంగ వేలం టెండర్లు నిర్వహించబడును.

వ.నం.	వివరములు	కాలపరిమితి	ధరావత్తు రూ.
1.	పెండ్లి మండపములు (3వ మారు) (సీల్డు టెండరు)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	1,00,000-00
2.	శ్రీస్వామివారికి భక్తులు సమర్పించిన బియ్యం ప్రోగుచేసుకొని తీసుకొనిపోవు హక్కునకు (సీల్డు టెండరు 3వ మారు)	అప్పగించిన తేదీనుండి 2 సం॥ల కాలపరిమితికి	50,000-00
3.	స్టేషనరీ (సీల్డు టెండరు) (3వ మారు)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	20,000-00

షరతులు: **1.** సీల్డు టెండరుకు దాఖలు చేయువారు రూ. 1,000/-లు చెల్లించి టెండరు షెడ్యూల్స్ కార్యాలయం పనివేళలందు ది. 23-03-2024వ తేదీన 10 గం॥ల నుండి ది. 27-03-2024 మ॥ 12.00 గం॥ వరకు పొందవచ్చును. **2.** సీల్డు టెండరు / బహిరంగ వేలం పాటలలో పాల్గొనువారు ధరావత్తును కార్యనిర్వహణాధికారి, శ్రీ బాల బాలాజీ దేవస్థానం వారి పేరున ఏదేని జాతీయ బ్యాంకు నుండి డి.డి. తీసి టెండరుతో జత చేయవలెను. లేదా సీల్డు టెండరు / బహిరంగ వేలం పాటలలో పాల్గొనువారు నగదు రూపేణ చెల్లించి సదరు వేలం ప్రక్రియలో పాల్గొనవచ్చును. సీల్డు టెండర్లు దాఖలు చేయు ఆఖరు తేది. 27-03-2024 మ॥ 01.00 గంటల లోపు టెండరు బాక్సు నందు వేయవలెను. **3.** సీల్డు టెండర్లు అదేరోజు అనగా తేది. 27-03-2024 మ॥ 02.00 గం॥లకు దేవస్థానం కార్యాలయం నందు టెండరుదారుల సమక్షంలో తెరువబడును. **4.** ఇతర షరతులు మరియు వివరములు కార్యాలయం పనివేళలందు ఫోన్ నెంబరు 08862-239562, 9491000720, 9652323999 ద్వారా తెలుసుకొనవచ్చును.

అప్పనపల్లి
22-03-2024
సహాయ కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KAKINADA
O.S. No. 1168/2022
Between :
THE KARNATAKA BANK LTD.,
rep. by its Branch Manager,
a banking company, Regd. under the companies Act 1913, having its Regd. Office at Mahaveer Circle, Kankanady, Mangalore and a Branch Office amongst other Branches at Kakinada, Rep. by its Branch Manager, Kakinada. ...Plaintiff
and
1) CHEKURI KASI VISWESWARA RAO & ANOTHER ...Defendants
To, Defendant - 1:
Chekuri Kasi Visweswara Rao,
S/o. (Late) Ch. Padharaju, Business, D.No. 1-14-02A, Gopal Nagar, Yanam, Pondicherry State.

పై నెంబర్ దావా యందు ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **ది. 26-04-2024 సం॥తేదీకి** వాయిదా వేసియున్నారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ హజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
// శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం //
వేమూరి చంద్రమౌళి
వాది తరపు న్యాయవాది
డో.నెం. 67-7-4/7ఎ, ఆంధ్రా బ్యాంక్ దగ్గర, అశోక్ నగర్, కాకినాడ - 3,
ఫోన్: 0884-2343562, 9849545912

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P. No.94/2023
Between:
పిటిషనర్లు: 1) గంగాపాత్రుని లోవసాయిశ్రీ
2) గంగాపాత్రుని వీరలోకేష్
1, 2 పిటిషనర్లు మైనర్లు అయినందున గార్డియను తల్లి గంగాపాత్రుని సునీత, W/o. లేటు దుర్గా ప్రసాద్, డో.నెం.45-19/1, ఉప్పువారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా
మరియు
రెస్పాండెంట్లు: Nill

పై నెంబరు కేసులో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిలో 1వ మరియు 2వ పిటిషనర్లుకు గల 2/3వ వంతు వాటా ఆస్తిని క్రయపర్చి, సదరు ఆస్థి పైన 1, 2 పిటిషనర్లు యొక్క తండ్రిగారయిన గంగాపాత్రుని దుర్గా ప్రసాద్ గారు కాకినాడ కోపరేటివ్ బిల్డింగు సొసైటీ లిమిటెడ్ వద్ద సదరు ఆస్థిపైన చేసిన తనఖా బాకీని తీర్చివేసి, మిగిలిన క్రియ ప్రతిఫలం సొమ్మును సదరు 1, 2 పిటిషనర్లు యొక్క అభివృద్ధి నిమిత్తం ఖర్చు చేయుటకు సదరు 1, 2 పిటిషనర్లు యొక్క తల్లి మరియు గార్డియన్ అయిన గంగాపాత్రుని సునీత గారికి పర్మిషను యిప్పించమని దాఖలుచేసిన పై నెంబరు కేసులో ఎవరికైననూ అభ్యంతరములు వున్న యెడల పై కోర్టువారి ఎదుట ది.**02-04-2024**వ సం॥రం తేదీన పగలు గం॥ **10.30** ని॥లకు హాజరయి ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలంగా తెలియపర్చుడమైనది.

SCHEDULE: Madras Terraced building with Ground and First Floor alongwith site in an extent of 126 sq.yds. or 105.84 sq.mtrs. in D.No.33-5-26 in assessment NO.1060007138, T.S. No.497, Ward No.14, Block No.33, Near Market, Kancharlavari Street, previously Kakinada Municipal area, presently Kakinada Municipal Corporation area, Kakinada Registry, Kakinada Urban Mandal, previously East Godavari District, presently Kakinada District within the following boundaries:
East: 81' or 24.62 meters - Propertyof Bhimala Satya Padma, **West:** 81' or 24.62 meters - Property of Sunkara Ramarao, **North:** 14' or 4.25 meters - Property of Repaka .Sarvesh Kumar, **South:** 14' or 4.25 meters - Municipal Road.
In the above boundareis an extent of 126 sq.yrds. out of it undevided 70 sq.yrds with proportionate share in ground and first floor in the building D.No.33-5-26 with all electric fittings, meter deposits, water ways, common ways with all easementary rights etc.

కాకినాడ
ది.15-03-2024
అల్తాఫ్ మహమ్మద్
పిటిషనర్లు తరపు అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848047860